సాక్షి
విశాఖపట్నం
శనివారం। 16। ఆగస్టు। 2025

● సాగరతీరాన.. స్వాతంత్య్ర శోభ









ఎగరాలి .. ఎగరాలి జాతీయ జెండా..

స్వేచ్ఛా భారతావనికి జయహో





జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి.. గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్. చిత్రంలో కలెక్టర్ హరేందిర ప్రసాద్, సీపీ బాగ్చి

న్యూస్‌రీల్

విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేఐవోసీఎల్ పెల్లెట్లు



ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఖుద్రే ముఖ్ ఐరన్ ఓర్ కంపెనీ లిమిటెడ్ (కేఐవోసీఎల్) నుంచి పెల్లెట్ల సరఫరా ప్రారంభమైంది. పరిశ్రమ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 7.3 మిలియన్ టన్నులకు పెంచే లక్ష్యంతో, కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్, కేఐవోసీఎల్ మధ్య ఇటీవల ఒప్పందం కుదిరింది. ఇందులో భాగంగా కేఐవోసీఎల్ విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఏడాదికి 2 మిలియన్ టన్నుల పెల్లెట్లను సరఫరా చేయనుంది. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఓడ ద్వారా మొదటి బ్యాచ్‌ను పంపించింది. ఈ విషయాన్ని కేంద్ర ఉక్కు కార్యదర్శి సందీప్ పౌండ్రిక్ 'ఎక్స్'లో వెల్లడించారు.

చరణ్‌కు గవర్నర్ అభినందన



చరణ్‌ను ఆశీర్వదిస్తున్న రాష్ట్ర గవర్నర్

కూర్మన్నపాలెం: జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు అట్టాడ చరణ్‌ను రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ అభినందించారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజభవన్ నుంచి వచ్చిన పిలుపు మేరకు శుక్రవారం రాజభవన్‌కు వెళ్లిన ఆయన్ని గవర్నర్ స్వయంగా అభినందించారు. అనంతరం విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్‌ను కలిశారు. ఆయన కూడా అభినందించారు. చరణ్ వెంట గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

హరేకృష్ణ వైకుంఠంలో కృష్ణాష్టమి వేడుకలు



శ్రీరాధాకృష్ణులకు పూజలు చేస్తున్న భక్తులు

తగరపువలస: గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠం వద్ద హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరగనున్న శ్రీకృష్ణాష్టమి వేడుకలు శుక్రవారం ప్రారంభించారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు నిష్కించన భక్తదాస ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు బాల గోపాలునికి ఉయ్యాలసేవతో ఉత్సవాలు నిర్వహించారు. శ్రీరాధాకృష్ణుల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. శనివారం శ్రీకృష్ణ భగవానునికి మహాభిషేకాలు, మహా మంగళ హారతి ఇవ్వనున్నారు. మిగిలిన రెండు రోజుల పాటు యథావిధిగా ఉయ్యాల సేవ, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించనున్నారు.

కలెక్టరేట్ ముఖద్వారం ప్రారంభం



ప్రారంభిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

బీచ్‌రోడ్డు: ఆధునిక హంగులతో రూపుదిద్దుకున్న కలెక్టరేట్ ముఖద్వారాన్ని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. పాత గేటు స్థానంలో కొన్ని రకాల మార్పులు చేసి రూ.80 లక్షల వ్యయంతో దీన్ని ఇటీవల నిర్మించారు. విద్యుదీకరణ, సీసీ కెమెరాలు, ప్రత్యేక సెక్యూరిటీ గదులు, ఇన్- ఔట్ గేట్ల గూండా రాకపోకలు సాగించేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్, జేసీ కె.మయూర్‌అశోక్, వీఎంఆర్డీఏ ఎస్ఈ బలరామరాజు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్ డి అడిక్షన్ సెంటర్‌లో పోస్టులకు దరఖాస్తులు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో డ్రగ్ డి అడిక్షన్ సెంటర్‌లో ఉద్యోగ నియామకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జైల్ సూపరింటెండెంట్ ఎం.మహేష్‌బాబు తెలిపారు. ప్రాజెక్టు కోఆర్డినేటర్, అకౌంటెంట్ కమ్ క్లర్క్, మనస్తత్వవేత్త/కౌన్సిలర్, సామాజిక కార్యకర్త, నర్సు(మెన్), వార్డ్ బాయ్, పీర్ ఎడ్యుకేటర్ పోస్టుల్ని భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. 21 నుంచి 35 ఏళ్ల మధ్య వయసుండి, ఆయా పోస్టుల ఆధారంగా 8 నుంచి డిగ్రీ వరకు చదువుకుని, కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అర్హత, ఆసక్తిగల వారు సెప్టెంబర్ 15లోగా రిక్రూట్‌మెంట్ చైర్మన్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్, కోస్టల్ ఆంధ్రా రేంజ్, ప్రభుత్వ ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా, రాజమహేంద్రవరం, తూర్పు గోదావరి జిల్లా చిరునామాకు పోస్టు/నేరుగా వెళ్లి దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

అంతర్జాతీయ నగరంగా విశాఖ

- సంక్షేమంతో పాటు అభివృద్ధే లక్ష్యం
- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని
- రూ.214.99 కోట్ల నగదు ప్రోత్సాహకాల పంపిణీ



రైల్వే గ్రౌండ్స్‌లో ఆర్పీఎఫ్ విన్యాసాలు

విశాఖ సిటీ/బీచ్‌రోడ్డు: విశాఖ నగరాన్ని అంతర్జాతీయ స్థాయి నగరంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. 79వ స్వాతంత్య్ర దినోత్సవం పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి జాతీయ జెండాను ఆవిష్కరించారు. కలెక్టర్ ఎం.ఎన్.హరేంద్ర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చిలతో కలిసి మంత్రి ఓపెన్ టాప్ వాహనంలో పరేడ్ మైదానాన్ని సందర్శించారు. పరేడ్ కమాండర్ విజయ్ కుమార్ నేతృత్వంలో పోలీస్ సిబ్బంది, ఎన్సీసీ క్యాడెట్లు కవాతు నిర్వహించారు. జాతి సమైక్యతను చాటి చెబుతూ త్రివర్ణ పతాక రంగుల్లో ఉన్న బెలూన్లను గాల్లోకి ఎగురవేశారు. ఈ సందర్భంగా మంత్రి జిల్లా అభివృద్ధి, ప్రభుత్వ ప్రగతి గురించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి ఉందని, ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నామని తెలిపారు. సీఎం చంద్రబాబు బ్రాండ్ ఇమేజ్‌తో రాష్ట్రానికి పరిశ్రమలు క్యూ కట్టేలా చేశారని, ఈ ఏడాదిలోనే రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయని మంత్రి వివరించారు. విశాఖను ఐటీ, డేటా హబ్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ క్రమంలో గూగుల్ సంస్థ ఆరు బిలియన్ డాలర్ల పెట్టుబడితో డేటా సెంటర్ ఏర్పాటు చేయనుందని, టీసీఎస్ సంస్థ రూ.1,370 కోట్లతో 12,000 ఉద్యోగాలు కల్పించేందుకు ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. కాగ్నిజెంట్ సంస్థ కూడా రూ.1,583 కోట్లతో కొత్త క్యాంపస్‌ను నిర్మించనుందని, అలాగే ఏఎన్ఎస్ఆర్ గ్రూప్ రూ.1,000 కోట్లతో, సత్వా గ్రూప్ రూ.1,500 కోట్లతో తమ సంస్థలను ఏర్పాటు చేస్తాయని వెల్లడించారు.



స్వాతంత్య్ర సమరయోధులకు నృత్యార్చన

భూ పరిపాలన సంస్కరణలు

భూ పరిపాలన అంశాల్లో సంస్కరణల కోసం తనతో పాటు మరో ఐదుగురు మంత్రులతో కూడిన జీవోఎంను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని మంత్రి తెలిపారు. వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్పిడి చేసుకునేందుకు ఉద్దేశించిన నాలా చట్టాన్ని రద్దు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. అసైన్డ్ భూముల ఫ్రీ హోల్డ్ వ్యవహారంపై పరిశీలన చేసి, నిరుపేదలకు ప్రయోజనం చేకూరేలా నిర్ణయం తీసుకుంటామన్నారు. అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లోని అక్రమ కట్టడాలను క్రమబద్ధీకరించడానికి జీవో నంబర్ 30ని జారీ చేసినట్లు వివరించారు.



ఆపరేషన్ సిందూర్ ప్రదర్శన ఇస్తున్న చిన్నారులు

ప్రత్యేక స్టాళ్లు.. నగదు ప్రోత్సాహకాలు

హర్ ఘర్ తిరంగా అనే అంశంపై సమాచార శాఖతో పాటు పలు శాఖలు సంక్షేమ పథకాలను వివరిస్తూ స్టాళ్లు ఏర్పాటు చేశాయి. వీటిని కలెక్టర్, జేసీ ఇతర అధికారులతో కలిసి మంత్రి సందర్శించారు. అక్కడి విశేషాలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా వివిధ సంక్షేమ పథకాల కింద రూ.214.99 కోట్ల నగదు ప్రోత్సాహకాలను లబ్ధిదారులకు అందజేశారు. విశాఖ ఎంపీ శ్రీ భరత్, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, వేపాడ చిరంజీవిరావు, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, విష్ణుకుమార్ రాజు, న్యాయ, పోలీస్, రెవెన్యూ అధికారులు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

స్నాక్స్‌తో కడుపు నొప్పి

వేడుకల సందర్భంగా మీడియా ప్రతినిధులు, అధికారులు, ప్రేక్షకులకు పంపిణీ చేసిన స్నాక్స్ అస్వస్థతకు కారణమయ్యాయి. పంపిణీ చేసిన ఒక్కో కచోరీ నాసిరకంగా ఉండటంతో వాటిని తిన్న చాలా మందికి కడుపునొప్పి వచ్చింది. ఈ విషయంపై జర్నలిస్టు సంఘం నాయకుడు నారాయణ జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.



వేడుకలకు హాజరైన రాజకీయ ప్రముఖులు



సాయుధ బలగాల మార్చ్‌పాస్ట్



రైల్వే మైదానంలో చిన్నారుల ప్రదర్శన



పరేడ్ గ్రౌండ్స్‌లో సాంస్కృతిక ప్రదర్శన

దేశభక్తిని చాటిన ప్రదర్శనలు



వేడుకల్లో భాగంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జ్ఞానాపురం సేక్రెడ్ హార్ట్స్ పాఠశాల విద్యార్థులు దేశమంటే.. దేశమంటే.. మతం కాదోయ్ అనే గేయ నృత్య ప్రదర్శనతో ప్రారంభమైన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. భరతమాత బిడ్డలురా.. బోర్డర్‌లో ఒరిగెనురా అంటూ నడుపూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఏ దేశమేగినా.. ఎందు కాలిడినా అంటూ పద్మనాభం కేజీబీవీ విద్యార్థులు, భారతీయ సమరస భావన థీమ్‌తో తగరపువలస కేథరిన్ పాఠశాల విద్యార్థులు, వందేమాతరం.. సుందర భారతం.. అంటూ పెందుర్తి ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఏతో.. కాశ్మీర్.. హై.. అంటూ విశాఖ వ్యాలీ విద్యార్థులు నృత్య ప్రదర్శనలు చేశారు. విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

కూటమి శకటాల్లో వైఎస్సార్ సీపీ ముద్ర

జిల్లాలోని వివిధ శాఖల ఆధ్వర్యంలోని ప్రగతిని తెలియజేస్తూ ఎనిమిది శకటాల ప్రదర్శన నిర్వహించారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర ఉద్దేశాలను తెలుపుతూ జీవీఎంసీ, భవిష్యత్తు విశాఖ కోసం సుస్థిరమైన మౌలిక వసతుల అభివృద్ధి అనే థీమ్‌తో వీఎంఆర్డీఏ, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం, తల్లికి వందనం పథకాన్ని వివరిస్తూ విద్యాశాఖ, నా ఆరోగ్యం-నా హక్కు అనే అంశంతో వైద్యారోగ్య శాఖ, ఎన్టీఆర్ పేదలందరికీ ఇళ్లు పథకంపై గృహ నిర్మాణ శాఖ, పేదరికం రహితం-పీ4 విధానం పేరుతో ప్రణాళికా విభాగం, పీఎం సూర్యఘర్ ఆవశ్యకతను తెలుపుతూ ఈపీడీసీఎల్ శకటాలను ప్రదర్శించాయి. వీటిలో గృహ నిర్మాణ శాఖ శకటానికి ప్రథమ స్థానం దక్కింది. రెండో స్థానంలో జీవీఎంసీ, మూడో స్థానంలో సమగ్ర శిక్ష, విద్యాశాఖలు సంయుక్తంగా నిలిచాయి.



మొదటి బహుమతి: గృహ నిర్మాణ శాఖ శకటం

పీఎం సూర్యఘర్ అంశాన్ని వివరిస్తూ ఏపీడీసీఎల్ ఏర్పాటు చేసిన శకటానికి ప్రోత్సాహక బహుమతి లభించింది. ఆయా శాఖల అధికారులను అభినందిస్తూ రెవెన్యూ మంత్రి ప్రశంసా పత్రాలు అందజేశారు. కాగా.. ఈ శకటాల్లో ప్రదర్శించిన చాలా అభివృద్ధి పనులు.. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేపట్టినవే కావడం విశేషం. ముఖ్యంగా జీవీఎంసీ, వీఎంఆర్డీఏ, గృహ నిర్మాణ శాఖ శకటాల్లో గత ప్రభుత్వం చేసిన అభివృద్ధి స్పష్టం కనిపించింది.



రెండో బహుమతి: జీవీఎంసీ శకటం



మూడో బహుమతి: విద్యా శాఖ శకటం

'స్త్రీ శక్తి' మహిళల స్వేచ్ఛా విహంగానికి దోహదం

రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్

మద్దిలపాలెం : స్త్రీ శక్తి పథకం మహిళల స్వేచ్ఛా విహంగానికి ఎంతగానో దోహదపడుతుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. స్త్రీ శక్తి పథకాన్ని ఆయన మద్దిలపాలెం ఆర్టీసీ డిపోలో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్సుల్లో వివిధ ప్రాంతాలకు ప్రయాణించే పలువురు మహిళలకు జీరో ఫేర్ టికెట్లను అందజేశారు. అనంతరం ఎండాడ వరకు సిటీ బస్సులో ప్రయాణించారు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ వంటి ఐదు రకాల సర్వీసుల్లో మహిళలు ప్రయాణించేందుకు వీలు కల్పిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ పథకం ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన మహిళలకు నెలకు రూ.2000 నుంచి 3000 వరకు ఆర్థికభారం తగ్గుతుందన్నారు. ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ జిల్లాలో మహిళల ఉచిత బస్సు ప్రయాణం కోసం ఆర్టీసీ అధికారులు 576 బస్సులు సిద్ధం చేశారని చెప్పారు. కలెక్టర్ ఎం.ఎం.హరేందిర ప్రసాద్ మాట్లాడుతూ స్త్రీ శక్తి పథకం రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు స్వాతంత్య్ర దినోత్సవ కానుక అందించిందన్నారు. పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ ఉచిత బస్సు మహిళల ఆర్థికాభివృద్ధికి బాటలు వేస్తుందన్నారు. మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు పి.విష్ణుకుమార్ రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, పార్టీ నేతలు గండి బాబ్జీ, దువ్వారపు రామారావు, సీతంరాజు సుధాకర్, ఆర్టీసీ ప్రాంతీయ మేనేజర్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



మద్దిలపాలెం డిపోలో పథకాన్ని ప్రారంభించిన రెవెన్యూ మంత్రి సత్యప్రసాద్

స్వేచ్ఛ, స్వాతంత్య్రాన్ని హరించేలా కూటమి పాలన

- వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు
- పార్టీ కార్యాలయంలో ఘనంగా స్వాతంత్య్ర వేడుకలు

సాక్షి, విశాఖపట్నం: ఎంతోమంది మహనీయుల ప్రాణత్యాగాల ఫలితంగా లభించిన స్వేచ్ఛ, స్వాతంత్య్రాన్ని కూటమి ప్రభుత్వం అపహాస్యం చేస్తోందని వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు అన్నారు. శుక్రవారం మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా వలంటీర్ విభాగం అధ్యక్షుడు పీలా ప్రేమకిరణ్ ఆధ్వర్యంలో 79వ స్వాతంత్య్ర దిన వేడుకలు నిర్వహించారు. ముందుగా కేకే రాజు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, సమన్వయకర్తలు మొల్లి అప్పారావు, దేవన్‌రెడ్డితో కలిసి గాంధీ, అంబేడ్కర్, వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేకే రాజు మీడియాతో మాట్లాడుతూ మహానేత వైఎస్సార్ ఆశయాలకు అనుగుణంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దారన్నారు. అలాంటి ఈ రాష్ట్రంలో ప్రజల స్వేచ్ఛ, స్వాతంత్య్రాలకు భంగం కలిగిస్తూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కూడా కాలరాస్తున్నారని మండిపడ్డారు. పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికలో కూటమి ప్రభుత్వం దేశం మొత్తం ఉలిక్కిపడే విధంగా ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, తైనాల విజయకుమార్, చింతలపూడి వెంకటరామయ్య, డిప్యూటీ మేయర్ కె.సతీష్, పార్టీ కార్యాలయ ఇన్‌చార్జి రవిరెడ్డి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్ రాజు, చెన్నా జానికిరామ్, బిపిన్ కుమార్ జైన్, శశికళ, వావిలాల ప్రసాద్, ముఖ్యనేతలు రొంగలి జగన్నాథం, నడింపల్లి కృష్ణంరాజు, రవిరాజు, ద్రోణంరాజు శ్రీవాత్సవ్, డాక్టర్ జహీర్ అహ్మద్, అల్లంపల్లి రాజుబాబు, పీలా వెంకటలక్ష్మి, రామన్న పాత్రుడు, మువ్వల సురేష్, శ్రీదేవి వర్మ, దేవరకొండ మార్కండేయులు, బి.రాధ, ఈశ్వరి, బి.హరికిరణ్ రెడ్డి, డా. మంచా నాగమల్లేశ్వరి, నూకరాజు, మక్సూద్ అహ్మద్, జిల్లా అనుబంధ విభాగం అధ్యక్షులు తదితరలు పాల్గొన్నారు.



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు

అరిగిన చక్రాలు.. ఆగిన సేవలు

- తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌కు బ్రేకులు
- 23 వాహనాల్లో మూలకు చేరినవి 8
- మరమ్మతులతో షోరూమ్‌ల్లో మరో 5
- మూడు నెలలుగా డ్రైవర్లకు అందని జీతాలు

ఆటోలే దిక్కు..



ఈ నెల 6న వెంకటలక్ష్మి అనే మహిళ డెలివరీ కోసం కేజీహెచ్ గైనిక్ వార్డులో చేరింది. ఈ నెల 7వ తేదీన పాప జన్మించింది. ఆమెను 11వ తేదీన డిశ్చార్జి చేశారు. ఆమె కుటుంబ సభ్యులు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సర్వీసుకు ఫోన్ చేయగా.. వాహనాలు నడపడం లేదని.. డీజిల్ లేదని.. మరమ్మతులకు గురయ్యాయని డ్రైవర్లు సమాధానం ఇచ్చారు. దీంతో వెంకటలక్ష్మి పాపతో ఆటోలో గాజువాకలోని ఇంటికి వెళ్లాల్సి వచ్చింది. ఇటీవల ఇద్దరు బాలింతలు ఇదే విధంగా ఆటోలో ఇంటికి వెళ్లడం ఆస్పత్రిలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈనెల 12వ తేదీన కూడా ఓ బాలింతకు ఇదే పరిస్థితి ఎదురైంది.

మహారాణిపేట: గర్భిణులు, బాలింతలు, శిశువులను ఆస్పత్రులు, ఇళ్లకు చేర్చిన తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు నేడు దయనీయంగా మారాయి. ఈ వాహనాల నిర్వహణ దారుణంగా ఉంది. బ్యాటరీలు పని చేయక, టైర్లు అరిగిపోయి కదలడం లేదు. సరిపడే ఆయిల్ ఇవ్వకపోవడంతో వాహనాలను నడిపేందుకు డ్రైవర్లు వెనుకంజ వేస్తున్నారు. గత మూడు నెలలుగా జీతాలు కూడా ఇవ్వకపోవడంతో వాహనాల కెప్టెన్లు అవస్థలు పడుతున్నారు. వాహనాలు రాకపోవడంతో కేజీహెచ్ గైనిక్ వార్డులో డిశ్చార్జి అయిన బాలింతలు, వారి కుటుంబ సభ్యులు ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో బాలింతలను ఉచితంగా ఇళ్లకు క్షేమంగా పంపేవారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత తల్లీబిడ్డ వాహనాలను గాలికి వదిలేశారు. వాహనాలు రిపేర్లు అయినా పట్టించుకోవడం లేదు.

ఒకే వాహనంలో ఇద్దరు

వాహనాల కృత్రిమ కొరత వల్ల ఇటీవల కేజీహెచ్ నుంచి ఒకే వాహనంలో ఇద్దరు బిడ్డలతో బాలింతలను తల్లీబిడ్డ వాహనాలు తరలించడంపై చర్చ సాగుతోంది. ఒకే వాహనంలో ఇలా తరలించడం వల్ల తల్లులు అవస్థలు పడుతున్నారు. ఒకే రూటు కనుక అలా తీసుకెళ్లామని డ్రైవర్లు చెప్పకొస్తున్నారు. గతంలో అయితే ఎప్పుడైనా బాలింతలను తరలించడానికి వాహనాలు సిద్ధంగా ఉండేవి. ఇప్పుడు వాహనాలు లేక.. డ్రైవర్లు కానరాక ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

డ్రైవర్లకు ఆంక్షలు : తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లపై గతంలో కన్నా ఆంక్షలు ఎక్కువగా విధించారు. గతంలో నెలకు రూ.30 వేలు ఆయిల్ కోసం ఇచ్చేవారు. ఇప్పుడు నెలకు రూ.8 వేలతో సరిపెట్టుకోవాలని సూచిస్తున్నారు. యాజమాన్యం వల్ల డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారి పరిస్థితి ముందు నుయ్యి, వెనుక గొయ్యిలా ఉంది. ఆయిల్ ఇవ్వడం లేదని, ఇచ్చిన ఆయిల్‌తోనే పనిచేయాలని డ్రైవర్లపై ఒత్తిడి చేస్తున్నారు. పనిచేయకపోతే వేధింపులకు గురి చేస్తున్నారని పలువురు డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలలుగా జీతాలు కూడా ఇవ్వడం లేదని వాపోతున్నారు.



కేజీహెచ్‌లో నిలిచిపోయిన తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు

మొరాయిస్తున్న వాహనాలు



టైర్ పేలిపోయిన తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనం

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు జిల్లాలో 23 ఉండగా.. ఇందులో 8 వాహనాలు మూలకు చేరాయి. 5 వాహనాలు చిన్న చిన్న రిపేర్లతో నగరంలో ఒక ప్రైవేటు షోరూమ్‌లో ఉన్నాయి. కేజీహెచ్‌లో ఉన్న వాహనాలకు టైర్లు పేలిపోవడం, ఇంజిన్ మరమ్మతులు, ఇతర చిన్న చిన్న సమస్యలతో పక్కన పెట్టారు. రిపేర్లు చేయడానికి కూడా ముందుకు రావడం లేదు. ఉమ్మడి విశాఖ జిల్లాలో వాహనానికి ఒకరు చొప్పున 56 మంది డ్రైవర్లు (కెప్టెన్లు) పనిచేస్తున్నారు. కేజీహెచ్‌లో 9 వాహనాలు ఉన్నాయి. 3 వాహనాలను మరమ్మతు పేరిట మూలన పెట్టారు. 2 వాహనాలు షోరూమ్‌లో ఉంచారు. ఇప్పుడు నాలుగు వాహనాలు మాత్రమే బాలింతలను తరలించడానికి అందుబాటులో ఉన్నాయి. ఇలా అరకొర వాహనాలే ఉండడంతో బాలింతలు ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాల్లో ఇళ్లకు వెళ్తున్నారు.

375 మందికి ప్రతిభా పురస్కారాలు

ఉత్తమ సేవలందించిన అధికారులకు రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ చేతుల మీదుగా పురస్కారాలు అందజేశారు. వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, జేసీ కె.మయూర్ అశోక్, ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జీసీసీ ఎండీ కల్పనా కుమారి, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్, డిప్యూటీ కలెక్టర్లు సంగీత్ మాథుర్, ఎస్.సుధాసాగర్, పి.శేషశైలజ, బి.వి.రమణ తదితరులు మంత్రి నుంచి పురస్కారాలు అందుకున్నారు. వివిధ విభాగాల్లో ఉత్తమ పనితీరు కనబరిచిన 31 మంది జిల్లా స్థాయి అధికారులతో పాటు మొత్తంగా 375 మంది ఉద్యోగులకు అవార్డులు ప్రదానం చేశారు. – బీచ్‌రోడ్డు


మంత్రి అనగాని సత్య ప్రసాద్, కలెక్టర్ హరేంధిర ప్రసాద్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు స్వీకరిస్తున్న వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జీసీసీ ఎండీ కల్పనాకుమారి, డీఆర్వో భవానీశంకర్, ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్


రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి నుంచి ప్రశంసాపత్రం స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్


ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ డి.ఎ.నాయుడు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సింహాచలం, ఏపీఐఐసీ స్పెషల్ డిప్యూటి కలెక్టర్ అనిత , ఏపీఎస్ఆర్టీసీ డీపీటీవో అప్పలనాయుడు, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ శ్యామ్‌బాబు సివిల్ సప్లయ్ అధికారి వి.భాస్కరరావు, జిల్లా కో-ఆపరేటివ్ అధికారి టి.త్రివేణి, ఎస్ఎస్ఏ ఏడిషనల్ ప్రాజెక్టర్ కోఆర్డినేటర్ డాక్టర్ జె.చంద్రశేఖర్ రావు


జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి కె.రామారావు, హౌసింగ్ పీడీ సీహెచ్ సత్తిబాబు, శ్రామిక శాఖ డిప్యూటీ కమిషనర్ సునీత, డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు, జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ, జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజనల్ డైరెక్టర్ వి.రవీంద్ర, ప్రధాన సిటీ ప్లానర్ ప్రభాకర్, యూసీడీ పీడీ ఎం.సత్యవేణి, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, ఎన్ఐసీ జిల్లా అధికారి హమీద్ భాషా


జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు, రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ కె.ప్రభాకరరావు, జిల్లా రిజిస్ట్రర్ టి.ఉపేంద్రరావు, ప్రధాన ఇంజినీర్ పల్లంరాజు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యపద్మ స్టేట్ స్పోర్ట్స్ ఆఫీసర్ జూన్ గాలియట్, సర్వే అండ్ ల్యాండ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ సూర్యారావు, జిల్లా పర్యాటక అధికారి జె.మాధవి, వీఎంఆర్డీఏ కార్యదర్శి మురళీకృష్ణ, వీఎంఆర్డీఏ ఎస్టేట్ ఆఫీసర్ దయానిధి, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి రామలక్ష్మి


జిల్లా పరిషత్ సీఈవో పి.నారాయణమూర్తి, డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఉషారాణి, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.ప్రసాదరావు, జీవీఎంసీ సీవో కె.సంతోష్‌దీప, అగ్రికల్చర్ డీడీ శ్రీనివాస్ కిరణ్, కేజీహెచ్ పిల్లల విభాగాపతి డాక్టర్ చక్రవర్తి, ఎస్ఈ సత్యనారాయణరాజు, ఎస్ఈ కేవీఎన్ రవి, డిప్యూటీ కమిషనర్(రెవెన్యూ) శ్రీనివాసరావు, జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, జోనల్ కమిషనర్ శివప్రసాద్

సాక్షి క్లాసిఫైడ్స్

PREMIUM FLAT FOR SALE in SIVAJIPALEM
2 BHK, 920 SFT
North facing
opp: Sivaji park Road
9866122731, 9000922731

CHANGE OF NAME
I, GANJA SAROJINI W/o Ganja Soma Sekhar, Residing at D.No. 7-121/3/2, Nandamurinagar, LG Polymers, Gopalapatnam, Visakhapatnam - 530027. Now changed my name & DOB. from BABY SAJORA (Old Name), DOB : 01-01-1985 to GANJA SAROJINI (New Name), DOB : 01-06-1986. Henceforth I will be called as GANJA SAROJINI. (New Name), DOB : 01-06-1986. for all purpose.

Goods

భూమి అమ్మకం
■ అచ్యుతాపురం టు గాజువాక మెయిన్ రోడ్ ఫేషింగ్ 20 సెంట్ల భూమి సుమారు 960 గజాలు అమ్మకానికి కలదు. ఫోన్ : 93932 71777 [SCA25007293]

INDUSTRY FOR SALE / LEASE
■ Small scale industry for lease and sale with running condition at Sabbavaram. Contact : 98490 14946 [SCA25007124]

Services

GOLD LOANS
■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 14035]

Real Estate

OLD AGE HOME
■ Elder Home గాజువాక & అక్కయ్యపాలెం వృద్ధుల ఆశ్రమం. వృద్ధులకు మంచాన వున్న వారికి మంచి వాతావరణం, ఆరోగ్యకరమైన భోజనం 24 గం॥ వైద్యసేవలు. హోమ్‌కేర్ సర్వీస్ కలదు. ఫోన్ : 87904 49799, 90103 92178 [SCA25007304]

COMMERCIAL SPACE FOR SALE
■ (New) Commercial Space 3500 Sft. 3rd Floor, 3.70 Cr, Nr. Passport Office (Muralinagar) A to Z Real Eastate. Ph : 95421 56666 [V- 7273]

Wanted

■ ఫర్నిచర్ డెలివరీ ఆటో నడుపుటకు డ్రైవర్స్ కావలెను. (జీతం : 16,000/-) & హెల్పర్స్, సూపర్‌వైజర్ కావలెను. ఫోన్ : 77299 49079 [V- 14263]

FALT FOR SALE
■ 2 BHK FULLY FURNISHED FLAT for SALE , Power Backup, Ongole , Contact - 9845747380 [HA-14556]

PLOT FOR SALE
■ 112 Sq.Yards, West & South Facing Corner bit, B.PATTA Plot For Sale at Cheemalapalli, Vepagunta, Visakhapatnam. Cell: 77948 26155 [SCA25006871]
■ ఆనందపురం దగ్గర్లో వెంటనే ఇల్లు కట్టుకుని అనుకూలంగా 900 చదరపు గజాల నార్త్ ఫేసింగ్ 40 అ॥ BT రోడ్డుతో అమ్మకంనకు కలదు. చ॥గ॥ కేవలం రూ. 12,500/- మాత్రమే. నో మీడియేటర్స్. ఫోన్ : 94085 69999 [V- 5183]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

TO-LET
■ 1150 Sft 2 Bedrooms Flat 2nd Floor for Rent (Office Purpose) at Bhanunagar, HB Colony, Near Krishna College, Visakhapatnam. Ph : 90591 87115 [SCA25007307]
■ To-Let 2 B/R, with Large Living Room, Individual House in Ganesh Nagar, Near Narasimhanagar Raitubazar. Employees Only. Contact Number. : 73821 21530 [SCA25007292]
■ 2000 Sq.Yrds. Site in దొరతోట Construction చేసి అద్దెకు ఇవ్వబడును. (గొడౌన్‌లకు, వేర్ హౌస్‌లకు). సంప్రదించ వలసిన నెంబరు : 80085 66668, 91772 55744 [SCA25007291]

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

మురళీనగర్, మాధవధార	: 90101 33346
NAD, కంచరపాలెం	: 90108 10033
గోపాలపట్నం, పెందుర్తి	: 70759 89701
సీతమ్మధార, ద్వారకానగర్	: 90100 55116
డాబాగార్డెన్స్, జగదాంబ MVP కోలనీ, మద్దిలపాలెం	90101 96663
గాజువాక	: 97059 33394

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

రూ.1,471 కోట్లతో షిప్‌యార్డ్ రికార్డు


షిప్‌యార్డ్ ఆవరణలో జెండాను ఆవిష్కరిస్తున్న సీఎండీ రాకేష్‌ప్రసాద్

సింధియా: హిందూస్థాన్ షిప్‌యార్డ్‌లో సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ రాకేష్‌ప్రసాద్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో సంస్థ చరిత్రలోనే మునుపెన్నడూ లేని విధంగా రూ.1,471 కోట్ల టర్నోవర్‌ను సాధించిందని వెల్లడించారు. సంస్థ ప్రారంభమైనప్పటి నుంచి ఇదే ప్రథమం అని తెలిపారు. ఐఎస్ఎస్ నిస్తార్, ఐఎన్ఎస్ సింధుకీర్తి వంటి నౌకలను నిర్మించి షిప్‌యార్డ్ ప్రతిష్టను ప్రపంచానికి చాటి చెప్పామన్నారు. క్లీన్ అండ్ గ్రీన్ పోటీల్లో విజేతలకు, ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

సమష్టి కృషితో విశాఖ నగరాభివృద్ధి


జాతీయ జెండాకు గౌరవ వందనం స్వీకరిస్తున్న మేయర్, కమిషనర్

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ఆవరణలో మేయర్ పీలా శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి, పలువురు కార్పొరేటర్లతో కలిసి జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ జెండా ఆవిష్కరించారు. జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ అందరి సహకారంతో విశాఖ నగర అభివృద్ధి సాధ్యమన్నారు. అనంతరం చెట్లు పెంచండి అనే నినాదంతో జీవీఎంసీ కె.కాలనీ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యరూపకం అలరించింది. జీవీఎంసీలో ప్రతిభ కనబరచిన పలువురు అధికారులు, ఉద్యోగులు, విశాఖ నగరాభివృద్ధికి సహకరిస్తున్న పలు స్వచ్ఛంద సంస్థలు, నివాసిత సంక్షేమ సంఘాలు, బ్యాంకుల ప్రతినిధులకు కమిషనర్ ప్రశంసాపత్రాలు అందజేశారు.

సరుకు రవాణాలో ముందంజ


పోర్టు స్టేడియంలో జెండాకు సెల్యూట్ చేస్తున్న పోర్టు ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు

సీతంపేట: విశాఖపట్నం పోర్టు అథారిటీ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలో ఛైర్మన్ డాక్టర్ ఎం. అంగముత్తు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛభారత్‌లో విశాఖపట్నం పోర్టు దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని, ఇందుకు సహకరించిన పోర్టు ఉద్యోగులను ఆయన ప్రశంసించారు. కాలుష్య నివారణ, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చడానికి ప్రాధాన్యమిస్తున్నట్టు తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో పోర్టు చరిత్రలోనే రికార్డు స్థాయిలో సరుకు రవాణా చేసినట్టు చెప్పారు. ఈ సందర్భంగా దేశభక్తిని చాటేలా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మాక్‌డ్రిల్, స్నిఫర్ డాగ్ ప్రదర్శనలు అలరించాయి. పోర్టులో పనితీరులో విశేష ప్రతిభ కనబర్చిన ఉద్యోగులు, పోర్టు భాగస్వాములు, స్టేక్ హోల్డర్స్‌కు ప్రశంసాపత్రాలు అందజేశారు. పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్, వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నగర పోలీస్‌కు ఇండియన్ ప్రెసిడెన్సీ మెడల్


అతిథుల నుంచి సత్కారం అందుకున్న ఏఎస్ఐ శేఖర్

డాబాగార్డెన్స్: సిటీ సెంట్రల్ క్రైం స్టేషన్ ఏఎస్ఐ పెదిరెడ్డి చంద్రశేఖర్ 2025 ఇండియన్ ప్రెసిడెన్సీ మెడల్‌కు ఎంపికయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపికైన 20 మంది పోలీసు అధికారుల్లో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ఏకైక ఏఎస్ఐ ఈయనే. చంద్రశేఖర్‌కు ఈ మెడల్ రావడం పట్ల పలువురు అధికారులు హర్షం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందికి ఈ మెడల్ అందజేస్తారు. చంద్రశేఖర్ తన కెరీర్‌ను 1984లో కానిస్టేబుల్‌గా ప్రారంభించారు. అప్పటి నుంచి ట్రాఫిక్, క్రైం, శాంతిభద్రతల విభాగాల్లో పనిచేసి అందరి మన్ననలు పొందారు. అనేక కేసులను ఛేదించి అధికారుల నుంచి ప్రశంసలు అందుకున్నారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన కార్యక్రమంలో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆయన్ని సత్కరించారు.

స్టీల్‌ప్లాంట్‌లో..


ప్రసంగిస్తున్న స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ పాండే

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని త్రిష్ణా మైదానంలో జరిగిన వేడుకల్లో డైరెక్టర్ (పర్సనల్) డాక్టర్ ఎస్.సి. పాండే జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఉద్యోగుల అంకితభావం, కృషి ఫలితంగా ఇటీవల ప్రారంభించిన బ్లాస్ట్‌ఫర్నేస్–3 ద్వారా స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తిలో మంచి పురోగతి సాధిస్తోందని పేర్కొన్నారు. దీని వల్ల భవిష్యత్‌లో స్టీల్‌ప్లాంట్ మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్లు జి.వి.ఎన్.ప్రసాద్, సలీమ్ జి.పురుషోత్తమన్, వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో..



బీచ్‌రోడ్డు: కలెక్టరేట్‌లో జాతీయ పతాకాన్ని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆవిష్కరించారు. ఆయనతో పాటు వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ జాతీయ పతాకానికి గౌరవ వందనం సమర్పించారు. డీఆర్వో బి.హెచ్.భవానీ శంకర్, కలెక్టరేట్ ఏవో రాణి, సూపరింటెండెంట్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కడలి గర్భంలో త్రివర్ణ రెపరెపలు!



79వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా రుషికొండ బీచ్ వద్ద శుక్రవారం జాతీయ జెండా రెపరెపలాడింది. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సహకారంతో లివ్ ఇన్ అడ్వంచర్స్ ఆధ్వర్యంలో సముద్ర గర్భంలో జాతీయ జెండాను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లివ్ ఇన్ వ్యవస్థాపకుడు బి.బలరామనాయుడు మాట్లాడుతూ ఎనిమిదిమంది డైవర్ల ఆధ్వర్యంలో కడలి గర్భంలో మన దేశ స్వాతంత్య్ర దినోత్సవాన్ని నిర్వహించడం దేశ భక్తికి హద్దుల్లేవన్న సంగతి గుర్తు చేసిందన్నారు. - కొమ్మాది

గ్యాస్ సిలిండర్ పేలుడు ఘటనలో మరో వ్యక్తి మృతి

డాబాగార్డెన్స్ : బీచ్‌రోడ్డు బుక్కావీధిలో ఈ నెల 7వ తేదీన జరిగిన గ్యాస్ సిలిండర్ పేలుడు ఘటనలో తీవ్రంగా గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న మరో వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. ఈ ఘటనలో మృతుల సంఖ్య నాలుగుకి చేరింది. ఇప్పిలి రంగారావు(53) గ్యాస్ సిలిండర్ పేలిన దుకాణానికి చేరువలోనే స్క్రాప్ దుకాణం నడుపుతున్నాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడు కేజీహెచ్‌లో చికిత్స పొందుతుండగా.. శుక్రవారం తీవ్ర ఛాతి నొప్పి రావడంతో మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు.

జిల్లా కోర్టులో..


మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు

అల్లిపురం: జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అలాగే బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడు ఎం.కె. శ్రీనివాసరావు, కార్యదర్శి ఎల్.పి. నాయుడు, సీనియర్ న్యాయవాదులు జాతీయ జెండాను ఎగురవేశారు. ఇటీవల నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. దాదాపు 8 దశాబ్దాల కాలంలో జిల్లా కోర్టు చరిత్రలో రెండు జాతీయ జెండాలు వేర్వేరుగా ఎగురవేయడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

వీఎంఆర్డీఏలో..


జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న మెట్రోపాలిటన్ కమిషనర్ విశ్వనాథన్

విశాఖ సిటీ: వీఎంఆర్డీఏ కార్యాలయ ఆవరణలో మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు. వీఎంఆర్డీఏలోని అన్ని విభాగాల సిబ్బంది కృషి కారణంగా సంస్థ ఆర్థిక క్రమశిక్షణతో ఎంతో ప్రగతిని సాధించిందని ప్రశంసించారు. విశాఖ, విజయనగరం, అనకాపల్లి జిల్లాల మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టినట్లు చెప్పారు. కార్యదర్శి మురళీకృష్ణ, ప్రధాన ఇంజినీర్ వినయ్ కుమార్, ఎస్టేట్ అధికారి దయానిధి, ప్రధాన గణాంకాధికారి హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

నేవీ నిఘా వ్యవస్థలో ఏఐ వినియోగం

- ఫిబ్రవరిలో అంతర్జాతీయ నౌకాదళ కార్యక్రమాలు
- తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్


గౌరవ వందనం స్వీకరిస్తున్న వైస్ అడ్మిరల్ పెంధార్కర్

సాక్షి, విశాఖపట్నం: వచ్చే ఏడాది ఫిబ్రవరి.. భారత నౌకాదళానికి పండగలా మారనుందని తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ అన్నారు. తూర్పు నౌకాదళ ప్రధాన స్థావరంలో ఈఎన్‌సీ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్, వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన గౌరవ వందనం స్వీకరించారు. వివిధ ప్లాటూన్‌లు, నౌకాదళ సిబ్బంది, ఎన్సీసీ క్యాడెట్స్, వివిధ నౌకల సిబ్బంది మార్చ్‌పాస్ట్ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే ఏడాది ఫిబ్రవరిలో విశాఖ నగరం ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ, మిలన్–2026 విన్యాసాలు, ఇండియన్ ఓషన్ నేవల్ సింపోజియంకు ఆతిథ్యం ఇవ్వనుందని తెలిపారు. ఇప్పటివరకు జరిగిన మిలన్ విన్యాసాల్లో ఇది అతి పెద్దదిగా నిలవనుందని.. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో సముద్ర ప్రయోజనాలను కాపాడే దేశాల్లో భారత్ ముందుందని వెల్లడించారు. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యంలో భాగంగా.. దేశీయ షిప్‌యార్డుల్లో 60కి పైగా యుద్ధ నౌకలు, సబ్‌మెరైన్‌ల నిర్మాణం జరుగుతోందన్నారు. ఈ నెల 26న విశాఖలో ఐఎన్ఎస్ ఉదయగిరి, ఐఎన్ఎస్ హిమగిరి యుద్ధ నౌకలను నేవీ అమ్ములపొదిలో చేరనున్నాయని వివరించారు. అలాగే ఈ ఏడాది చివరలో మరో రెండు యాంటీ సబ్ మెరైన్ వార్‌షిప్‌లు జాతికి అంకితం చేయనున్నట్లు తెలిపారు. ఐఎన్‌హెచ్ఎస్ కల్యాణి ఆసుపత్రిని పూర్తి స్థాయి కమాండ్ ఆసుపత్రిగా ఆధునీకీకరిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. సముద్ర భద్రతను మరింత కట్టుదిట్టం చేయడానికి నిఘా వ్యవస్థలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను వాడుతున్నామని ఈఎన్‌సీ చీఫ్ తెలిపారు. మానవరహిత ఉపరితల, నీటి అడుగున పోరాడే వ్యవస్థలు, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సూట్స్, నేవీ అప్‌గ్రేడ్ అయిందన్నారు. ఈఎన్‌సీ చీఫ్ ఆఫ్ స్టాఫ్, వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా పాల్గొన్నారు.

ప్రగతి పథంలో వాల్తేరు డివిజన్


మాట్లాడుతున్న డీఆర్ఎం లలిత్ బోహ్రా

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్ పరిధిలోని రైల్వే ఫుట్‌బాల్ గ్రౌండ్స్‌లో 79వ స్వాతంత్య్ర దినోత్సవం ఘనంగా జరిగింది. డీఆర్ఎం లలిత్‌బోహ్రా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, ఆర్పీఎఫ్, సివిల్ డిఫెన్స్ బృంద సభ్యుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం ఆయన వాల్తేర్ డివిజన్ సాధించిన ప్రగతిని వివరిస్తూ.. 'బ్లూచిప్ డివిజన్'గా ప్రకాశిస్తోందన్నారు. వాల్తేర్ డివిజన్ కల్చరల్ అసోసియేషన్, స్కౌట్స్ అండ్ గైడ్స్, రైల్వే ఉద్యోగులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. రైల్వే భద్రతా దళం ప్రదర్శించిన డేర్ డెవిల్స్ షో ఆహూతులను ఎంతగానో అలరించింది. అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ (ఇన్ఫ్రా) ఈ.శాంతారం, ఈకార్వో ప్రెసిడెంట్ జ్యోత్స్న బోహ్రా, సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ ఎ.పి.దూబే, సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ యూసుఫ్ కబీర్ అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతతో నిరంతర విద్యుత్ సరఫరా


ప్రశంసాపత్రం అందుకుంటున్న విశాఖ సర్కిల్ ఎస్ఈ శ్యామ్‌బాబు

సీతంపేట: ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కార్పొరేట్ కార్యాలయ ఆవరణలో ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి జాతీయ జెండాను ఎగురవేశారు. సంస్థ పరిధిలో 73 లక్షల వినియోగదారులకు అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో నిరంతరాయ విద్యుత్ సేవలందిస్తూ.. ప్రసార పంపిణీ నష్టాలను 5.8 శాతం కంటే తక్కువకు తగ్గించినట్లు తెలిపారు. పీవీటీజీ గిరిజన ఆవాసాల్లో 23,024 ఇళ్లకు, డీఏ-జేజీయూఏ పథకంలో 1979 ఇళ్లకు, అలాగే 13 వేలు ఇళ్లకు నాన్ పీవీటీజీ విద్యుత్ సదుపాయం కల్పించామన్నారు. ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన కింద 19,385 గృహాలపై 63,522 మెగావాట్ల సోలార్ రూఫ్‌టాప్ వ్యవస్థలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆర్డీఎస్ఎస్ పథకంలో భాగంగా 3004 కోట్లతో గ్రామీణ ప్రాంతాలకు నిరంతర త్రీ ఫేజ్ సరఫరా కోసం కొత్త ఫీడర్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన 97 మంది ఉద్యోగులకు సీఎండీ ప్రశంసాపత్రాలు అందజేశారు. సంస్థ డైరెక్టర్లు డి.చంద్రం, టి.వి.సూర్యప్రకాష్, టి.వనజ, సీజీఎంలు డి.సుమన్ కల్యాణి, వి. విజయలలిత, అచ్చి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.